క్లుప్తంగా

ఎన్నికల కేంద్రాల పరిశీలన



ఎన్నికల కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ మహేష్, అధికారులు

సి.బెళగల్: సి.బెళగల్‌లోని జెడ్పీ హైస్కూల్లో ఏర్పాటు చేసిన పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కేంద్రాలను గురువారం కర్నూలు డీఎస్పీ మహేష్ పరిశీలించారు. సీఐ శ్రీధర్, తహసీల్దార్ శివశంకర్‌నాయక్, ఎస్‌ఐ పీరయ్యతో ఎన్నికల కేంద్రాల పరిసరాలను పరిశీలించారు. ఓటర్లకు కల్పించనున్న వసతులు, సౌకర్యాలపై అధికారులతో చర్చించారు. పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు.

గూడూరు: గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఎంఎల్‌సీ ఎన్నికలకు సంబంధించి స్థానిక జెడ్పీ బాలికల పాఠశాలలో ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాలను గురువారం పట్టణంలో తహసీల్దార్ శివరాముడు పరిశీలించారు.

పుష్పరథంపై చెన్నసోమేశ్వరుడు

సి.బెళగల్: మండల పరిధిలోని పోలకల్ గ్రామంలో శ్రీ చెన్నసోమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం రాత్రి పుష్ప రథోత్సవం వైభవంగా ప్రారంభమయ్యాయి. గ్రామంలోని ఆలయం నుంచి గంగాదేవి, పార్వతీదేవి సమేత శ్రీ చెన్నసోమేశ్వర స్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పుష్ప రథంపై మేళతాళాలతో ఘనంగా ఊరేగించారు.

శ్రద్ధగా చదువుకోవాలి

సి.బెళగల్: మండలంలోని ఆయా పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు చదువులపై శ్రద్ధ వహించాలని ఎస్‌ఐ పీరయ్య అన్నారు. గురువారం ఆయన స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులతో సమావేశమయ్యారు. ఎస్‌ఐ మాట్లాడుతూ.. పరీక్షలు దగ్గర పడుతున్నందున సమయాన్ని వృథా చేయకుండా చదువుకోవాలన్నారు. పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. స్కూల్ హెచ్‌ఎం సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా గోకారమయ్య ఉరుసు

సి.బెళగల్: మండలంలోని బురాన్‌దొడ్డి గ్రామంలో శ్రీ గోకారమయ్య ఉరుసు ఉత్సవాలు గురువారం వైభవంగా జరిగాయి. గ్రామంలోని కేవీ కిరణ్ ఇంటి నుంచి బుధవారం రాత్రి ప్రత్యేక పూజల అనంతరం స్వామివారి గంధంను, జెండాలు, గుర్రంను మేళతాలాలతో ఊరేగింపుగా దర్గాకు తీసుకెళ్లారు. గ్రామ పెద్దలు, భక్తులు దర్గాలో జెండాలను ఆవిష్కరించారు.

కొనసాగిన పింఛన్ల పంపిణీ

గడివేముల: మండల పరిధిలోని గ్రామాల్లో రెండో రోజు గురువారం లబ్ధిదారులకు వలంటీర్లు పింఛన్లను పంపిణీ చేశారు. లబ్ధిదారులు ఎక్కడ ఉంటే అక్కడికి వెళ్లి పింఛన్ సొమ్ము ఇవ్వడంతో వారు ఆనందం వ్యక్తం చేశారు. మండలంలో 5685 పింఛన్లు ఉండగా ఇప్పటి వరకు 4818 పింఛన్లను అందించినట్లు ఎంపీడీఓ విజయసింహారెడ్డి తెలిపారు.

భవిత కేంద్రం తనిఖీ

కోడుమూరు రూరల్: కోడుమూరులోని కొండపేట పాఠశాల ఆవరణలో గల భవిత కేంద్రాన్ని విలీన విద్యా సమన్వయకర్త విజయ్ ప్రసాద్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల రిజిష్టర్లు, రికార్డులను పరిశీలించడంతో పాటు, విద్యార్థులతో కలిసి కృత నిర్వహణలో పాల్గొని ప్రోత్సహించారు. కార్యక్రమంలో విలీన విద్యా సహాయ సమన్వయకర్త వాణి, ఉపాధ్యాయులు సీతారామయ్య, నారాయణమ్మ తదితరులున్నారు.

మెరుగైన సేవలు అందించాలి

సి.బెళగల్: పెట్రోల్ బంక్ యాజమానులు వినియోగదారులకు మెరుగైన సేవలను అందించాలని తహసీల్దార్ శివశంకర్‌నాయక్ అన్నారు. గురువారం ఆయన మండల కేంద్రం సి.బెళగల్‌లోని బాలాజి కిసాన్ సేవా కేంద్రం (ఇండియన్ పెట్రోల్ బంక్)ను తనిఖీ చేశారు. పెట్రోల్, డీజిల్ ధరలను, రికార్డులను పరిశీలించారు. అదేవిధంగా ఆయిల్ నిల్వలను పరిశీలించి వివరాలను నమోదు చేసుకున్నారు. వినియోగదారులకు మంచినీటి వసతితోపాటు మరుగుదొడ్ల నిర్వహణపై శ్రద్ధ వహించాలని, ఉచిత గాలి పంపు సెట్ ఏర్పాటు తప్పకుండా చేయాలని తహసీల్దార్ యజమానిని ఆదేశించారు. తహసీల్దార్ వెంట వీఆర్వో శేఖర్, సిబ్బంది ఉన్నారు.

పాఠశాలల తనిఖీ

గూడూరు రూరల్: మండల పరిధిలోని చనుగొండ్లలోని మూడు ప్రభుత్వ పాఠశాలలను గురువారం ఎంఈఓ సునీలమ్మ తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథకం, విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం, శుద్ధమైన తాగునీటిని అందించాలన్నారు. నాడు-నేడు పనులను పర్యవేక్షించాలని, వచ్చే విద్యా సంవత్సరానికి పనులను పూర్తి చేసేలా హెచ్‌ఎంలు శ్రద్ధ చూపాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు.

రీ సర్వే వేగవంతం చేయాలి

గూడూరు రూరల్: భూముల రీ సర్వే వేగవంతం చేయాలని తహసీల్దార్ శివరాముడు గురువారం ఒక ప్రకటనలో రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. ఇప్పటి వరకు మండలంలో భూముల సర్వే 80 శాతం పూర్తి అయ్యిందన్నారు.

హరిత వనాలు... పాణ్యం నర్సరీలు

- బాటసారులను ఆకట్టుకుంటున్న మొక్కలు
- అందుబాటులో 600పైగా రకాలు

పాణ్యం: జిల్లాలోనే నర్సీలకు పెట్టింది పేరు పాణ్యం. ఇక్కడ దాదాపు 100 ఎకరాల్లో పైగానే నర్సరీలు సాగువుతున్నాయి. వాటిల్లో 600 రకలకు పైగా మొక్కలు లభిస్తున్నాయి. పాణ్యం నర్సరీల్లో లభించే మామిడి మొక్కలకు అత్యంత ప్రాముఖ్యత ఉంది. స్వతహాగా రైతులే తల్లి చెట్టుకు అంటు కట్టడంతో అవి ఆరోగ్యకరంగా, తెగుళ్ల తట్టుకునేలా ఉంటాయి. దీంతో ఇతర జిల్లాల నుంచి రైతులు మామిడి మొక్కల కోసం ఆరు నెలల ముందుగానే ఇక్కడ ఆర్డర్ చేస్తారు. వీటితోపాటు కొత్త కొత్త మొక్కలు నర్సరీల్లో కనువిందు చేస్తున్నాయి. హైవే పక్కనే ఇవి ఉన్నందున బాటసారులను, వాహనదారులను ఆకట్టుకుంటున్నాయి. దీంతో ప్రతిరోజు రోజు వాహనదారులు నర్సరీల్లో కాసేను గడిపి మొక్కలను కొనుగోలు చేసి వెళ్తుంటారు. అయితే నర్సరీల్లో లభించే మొక్కల్లో ట్యాక్టిస్, ఫామ్‌సిటీ, అరెలియస్‌బాల్, స్టార్‌ఫ్రుట్స్, ఇన్సులిన్, బొగంబిలియా తదితర అలంకరణ మొక్కలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ట్యాక్టిస్ మొక్క అతి చిన్నవిగా ఉండి కుండిలోనే బ్రతుకుతాయి. తెల్లటి రంగులో ఎంతో ఆకర్షణీయంగా ఉంటాయి. ఇంట్లో అలంకరణలకు చాలా బాగుంటుంది.



ట్యాక్టిస్ మొక్కలు



ఫామ్‌సిటీ   బబ్బరి పనాసా

ఫామ్‌సిటీ మొక్కల ఆకులు పెద్ద పూలవలే చుడముచ్చటగా ఉంటాయి. అరెలియస్‌బాల్ మొక్కలకు అసలు పూలు, కాయలు కాయవు. కేవలం ఆకులు మాత్రమే ఉంటాయి. ఈ ఆకులే పూల లాగా ఉంటాయి. ఈ మొక్కలు కూడా అతి చిన్నవిగా ఉంటాయి. స్టార్‌ఫ్రుట్స్ మొక్కల పండ్లు తిపి, ఒగరు , పులుపుతో ఉంటాయి. షుగర్, గ్యాస్ట్రబుల్ ఉన్న వారు ఈ పండ్లను ఎక్కువగా తింటారు. ఈ పండ్లు చాలా అరుదుగా దొరుకుతాయి. ఇన్సులిన్ మొక్కను షుగర్ ఉన్న వారు తీసుకుంటే మంచింది. బొగంబిలియా చెట్లు 6 నుంచి 7అడుగులు ఉంటాయి. దీని విలువ అక్షరాల రూ.23 వేలు. ఈ మొక్క పుట్టుకతోనే డిజైన్‌లతో పెరుగుతుంది. బబ్బరి పనాసా చెట్టు బత్తాయికి ప్రత్యామ్నాం. ఈ చెట్టు కాయ కనీసం కిలో నుంచి కిలోన్నర వరకు బరువుంటుంది. ప్రస్తుతం ఈ మొక్కలు పాణ్యం జాతీయ రహదారి వెంట ఉన్న నర్సరీల్లో అందుబాటు ఉన్నాయి.



బొగంబిలియా

అలంకరణ మొక్కలే ఎక్కువ కొనుగోలు

రోజురోజుకు మార్కెట్లోకి కొత్త, కొత్త మొక్కలు వస్తున్నాయి. రూ.20ల నుంచి నర్సరీల్లో రూ.10 లక్షల వరకు కూడా మొక్కలు అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం నర్సరీలో 600 రకాల మొక్కలు ఉన్నాయి. ప్రజలు తమ గృహ సముదాయాలకు కొత్త అందాలు తెచ్చే అలంకరణ మొక్కలను కొనుగోలు చేసేందుకే ఇష్టపడుతున్నారు. అలాగే మామిడి మొక్కల కోసం కూడా రైతులు ముందుగానే ఆర్డర్ ఇస్తుంటారు.

– సుధాకర్, నర్సరీ యజమాని



స్టార్‌ఫ్రుట్స్



అరెలియబాల్

అగ్నిమాపక నిరోధక సిలిండర్ల పంపిణీ

కోడుమూరు రూరల్: మండలంలో మనబడి నాడు-నేడు మొదటి విడత కింద ఎంపికైన పాఠశాలలకు ఏదైనా అగ్ని ప్రమాదాలు చోటు చేసుకున్న సమయంలో మంటలను ఆర్పే 37 సిలిండర్లు మంజూరైనట్లు ఎంఈఓ అనంతయ్య తెలిపారు. మంజూరైన సిలిండర్లను ఎంఈఓ గురువారం ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు అందజేశారు.

ఓటర్ల తుది జాబితా ప్రదర్శన

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండల ప్రజా పరిషత్ కార్యాలయం, కర్నూలు రూరల్ తహసీల్దార్ కార్యాలయాల్లో సుంకేసుల, ఆర్ కొంతలపాడు గ్రామాలకు సంబంధించి ఓటర్ల తుది జాబితాను ప్రదర్శనకు ఉంచామని కర్నూలు మండల ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఎస్ భాస్కర్‌నాయుడు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎంపీటీసీ ఎన్నిక నిర్వహణ కోసం తుది ఓటరు జాబితాను ప్రజల పరిశీలనార్థం ప్రచురించామని స్పష్టం చేశారు. సుంకేసులలో 1599 మంది ఓటర్లు ఉన్నారని, ఇందులో స్త్రీలు 808 మంది, పురుషులు 791 ఉన్నారన్నారు. ఆర్ కొంతలపాడులో 2083 మంది ఓటర్లు ఉన్నారని, ఇందులో స్త్రీలు 1011, పురుషులు 1072 మంది ఉన్నారన్నారు. కాగా గత సర్పంచ్, ఎంపీటీసీల ఎన్నికల్లో సుంకేసుల సర్పంచ్ కురువ గిడ్డమ్మ సర్పంచ్ స్థానంతో పాటు ఎంపీటీసీగా గెలుపొందారు. ఒకే వ్యక్తి రెండు స్థానాల్లో గెలుపొందడంతో ఆమె ఎంపీటీసీ పదవికి రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం ఖాళీగా ఉన్న ఎంపీటీసీ స్థానాల భర్తీకి ఎన్నికలు నిర్వహించేందుకు నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో ఓటర్ల జాబితాను అధికారులు అందుబాటులో ఉంచారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు



బండ లాగుతున్న వృషభాలు

ఓర్వకల్లు: మండలంలోని ఎస్ కొంతలపాడు గ్రామంలో గురువారం నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎద్దుల బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. యాగంటీశ్వరస్వామి తిరుణాల సందర్భంగా నిర్వహించిన ఈ పోటీలలో మొత్తం 12 ఎడ్ల జతలు పాల్గొనగా, అందులో పాణ్యం మండలం ఎస్ కొత్తూరుకు చెందిన బీరం సుబ్రహ్మణ్యేశ్వరరెడ్డి వృషభాలు(చిన్న జత) విజేతగా నిలిచాయి. నిర్ణీత సమయానికి 5620 అడుగుల దూరం లాగి మొదటి బహుమతి రూ.50 వేలను కైవసం చేసుకున్నాయి. అలాగే పాణ్యం మండలం ఎస్ కొత్తూరుకు చెందిన బీరం సుబ్రహ్మణ్యేశ్వరరెడ్డి వృషభాలు(పెద్ద జత) 5148 అడుగుల దూరం లాగి రెండవ స్థానంలో (రూ.40 వేలు), వైఎస్‌ఆర్ కడప జిల్లా ఖాదర్‌ఖాన్‌కొట్టాలకు చెందిన భావనశ్రీ వృషభాలు 5100 అడుగుల దూరం లాగి మూడో స్థానంలో (రూ.30 వేలు), నంద్యాల జిల్లా పాములపాడు మండలం అమ్మలూరుకు చెందిన తెలుగు పల్లవి వృషబాలు 5035 అడుగుల దూరం లాగి నాలుగో స్థానం(రూ.20 వేలు), వెల్దుర్తి మండలం కలుగోట్లకు చెందిన గొంది బజారి, దొర్నిపాడు గ్రామానికి చెందిన బత్తుల మనోహర్‌యాదవ్ వృషభాలు(ఉభయ జత) 5024 అడుగుల దూరం లాగి ఐదో స్థానంలో (రూ.15 వేలు) నిలిచాయి. ఎద్దుల యజమానులకు నిర్వాహకులు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు మద్దయ్య, నాగశేషులు, మాధవస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించుకుందాం



గృహసారథులు, కన్వీనర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

- ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): రాయలసీమ పశ్చిమ నియోజకవర్గ గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించుకుందామని కోడుమూరు శాసన సభ్యులు డాక్టర్ జరదొడ్డి సుధాకర్ పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం స్టాంటన్ పురంలోని వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ కార్యాలయంలో కోడుమూరు, గూడూరు, సి.బెళగల్, కర్నూలు మండలాల జేసీఎస్ (జగనన్న కన్వీనర్లు, గృహసారథులు)లతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ తరపున గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా వెన్నపూస రవీంద్రారెడ్డి, టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంవీ రామచంద్రారెడ్డిని గెలిపించేందుకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అన్ని వర్గాలకు మేలు చేస్తున్న ప్రభుత్వానికి యువత, ఉద్యోగులు ఓటుతో మద్దతు ఇవ్వాలని కోరారు. మార్చిలో 13వ తేదీన జరిగే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపు కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థి, యువజన, ఉపాధ్యాయ విభాగాలతో పాటు అభిమానులు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ గిప్సన్, గూడూరు జెడ్పీటీసీ మౌలాలి, మాజీ జెడ్పీటీసీ ఎల్ వెంకటేశ్వర్లు, సచివాలయ కన్వీనర్ కరీముల్లా, జేసీఎస్ కన్వీనర్ తులసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు ఉపాధి అవకాశాలు కల్పించాలి



ఇళ్ల నిర్మాణాలకు భూమి చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని

ఓర్వకల్లు: జల విద్యుత్తు ఉత్పాదకతకు భూములను త్యాగం చేసిన గిరిజనులకు పరిశ్రమలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సంస్థ ప్రతినిధులకు సూచించారు. గురువారం మండలంలోని బ్రాహ్మణపల్లె మజరా గ్రామమైన గుమ్మితం తండాలో పునరావాసం కింద నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేతో పాటు, గ్రీన్‌కో ప్రతినిధి శ్రీనివాసరావు, ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాసనాయుడు, ప్రాజెక్టు ఆఫీసర్ మహేష్, ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ ప్రాంతం భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులకు గురికాకూడదనే ఉద్దేశ్యంతో గ్రామాన్ని సురక్షిత ప్రాంతంలో సకల సదుపాయాలతో కూడిన ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. నూతనంగా నిర్మిస్తున్న కాలనీలో అన్ని వసతులను కల్పించాలని గ్రీన్‌కో అధికారులకు సూచించారు. ప్రస్తుతం 120-140 వరకు ఇళ్లు నిర్మించడమేగాక, సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వలతో పాటు, ఉచిత విద్యుత్, రవాణ సదుపాయం కల్పించాలన్నారు. తండా ప్రజలకు జూబ్లీహిల్స్ తరహాలో నాణ్యతతో కూడిన ఇళ్లను నిర్మించాలన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు నాగేశ్వరరెడ్డి, రాజశేఖర్‌చౌదరి, బీసీ రవికుమార్, దేవరాజు, రవి, పెద్దన్న, తండా నాయకులు నారాయణనాయక్, లాలునాయక్, భీమ్లానాయక్, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గింజనూ కొనుగోలు చేస్తాం



శనగ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏడీఏ

కోడుమూరు రూరల్: రబీ కింద రైతులు పండించిన ప్రతి గింజను రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందని కర్నూలు ఏడీఏ సాలురెడ్డి అన్నారు. గురువారం కోడుమూరులోని రైతుభరోసా కేంద్రం-3లో ఏర్పాటు చేసిన పప్పు శనగ కొనుగోలు కేంద్రాన్ని మండల వ్యవసాయాధికారి రవిప్రకాష్‌తో కలిసి ఏడీఏ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ శనగ సాగు చేసిన రైతులంతా బయట మార్కెట్లో వ్యాపారులకు అమ్ముకుని నష్టపోకుండా, ప్రభుత్వం క్వింటాల్ శనగలు రూ.5335ల ప్రకారం కొనుగోలు చేస్తోందన్నారు. ఏఓ రవిప్రకాష్ మాట్లాడుతూ మండలంలోని గ్రామాల వారీగా శనగ సాగు చేసిన రైతుల వద్ద నుంచి కేడీసీఎంఎస్ ద్వారా మద్దతు ధరతో దిగుబడులను కొనుగోలు చేస్తామన్నారు. ఎకరాకు 4క్వింటాళ్ల ప్రకారం ఒక్కో రైతు నుంచి గరిష్టంగా 100క్వింటాళ్ల వరకు ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేస్తోందన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే బీసీల అభ్యున్నతి





సమావేశంలో మాట్లాడుతున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి, చిత్రంలో మేయర్ బీవై రామయ్య, సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- ఎమ్మెల్యే కాటసాని, మేయర్ రామయ్య
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీ సాధిస్తాం
- సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి

కల్లూరు: రాష్ట్రంలో బీసీల అభ్యున్నతి వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమవుతుందని వైఎస్సార్‌సీపీ నంద్యా జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, కర్నూలు జిల్లా అధ్యక్షుడు, నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. గురువారం సాయంత్రం కల్లూరు అర్బన్ కార్పొరేటర్లు, కల్లూరు గ్రామీణ ప్రాంతానికి చెందిన ఎంపీటీసీలతో ఎమ్మెల్యే కాటసాని నివాసంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పార్టీ తరపున స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న డాక్టర్ బోయ మధుసూదన్‌ను కార్పొరేటర్లుకు, గ్రామీణ ప్రాంతాల నాయకులకు, ఎంపీటీసీలకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, మేయర్ మాట్లాడుతూ.. ఈ ఎమ్మెల్సీ ఎన్నికలు రాబోయే సార్వత్రిక ఎన్నికలకు ఫ్రీఫైనల్ లాంటివన్నారు. స్థానిక సంస్థల్లో టీడీపీకి బలం లేకపోయిన ఆ పార్టీకి చెందిన వారి చేతనే స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్ దాఖలు చేయించిందన్నారు. ఎన్నికల్లో ఎలాగో ఓడిపోతామని తెలుసుకున్న టీడీపీ నాయకులు తాము ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీ పేరును కూడా నామినేషన్‌లో కనపర్చలేని స్థితిలో ఉన్నారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీ సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. స్థానిక సంస్థలో మొత్తం 1,178 మంది ఓటర్లు ఉన్నారని అందులో 1030 వైఎస్సార్‌సీపీకి చెందిన వారేనన్నారు. టీడీపీకి కేవలం 127 ఓట్లు మాత్రమే ఉన్నాయన్నారు. అలాగే పట్టభద, టీచర్ల ఎమ్మెల్సీ అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి, ఎంవీ రామచంద్రారెడ్డిల గెలుపునకు అందరం కృషి చేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ బోయ మధుసూదన్ మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లాలో అందరూ ఎమ్మెల్యేలు సహకరిస్తున్నారన్నారు. ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలుస్తాననే నమ్మకం ఉందన్నారు. కార్యక్రమంలో కల్లూరు మండల అధ్యక్షురాలు బోయ శారద, జెడ్పీటీసీ ఆల ప్రభాకర్‌రెడ్డి, నగర డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కల్లావెంకట రమణారెడ్డి, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్(మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్) కేశవరెడ్డి, కల్లూరు అర్బన్ కార్పొరేటర్లు, మండల స్థాయి నాయకులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఓర్వకల్లు: స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా వైఎస్సార్‌సీపీ తరపున బరిలోకి దిగిన డాక్టర్ మధుసూదన్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అభ్యర్థించారు. గురువారం స్థానిక రంగనాథ్‌గౌడు వెంచర్‌లో మండలంలోని ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మధుసూదన్ విజయానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. టీడీపీ వారికి కనీసం అభ్యర్థులే కరువుకావడంతో స్వతంత్ర అభ్యర్థులను బలవంతంగా పోటీలోకి దించడం శోచనీయమన్నారు. ప్రతిపక్షాల నోరు మూసివేయాలంటే తమ పార్టీకి చెందిన ఎమ్మెల్సీ అభ్యర్థులకు ఓటువేసి గెలిపించాలని సూచించారు. సమావేశంలో ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు, సింగిల్ విండో చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ లోటర్ బాషా, వివిధ గ్రామాలకు చెందిన ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

కనుల పండువగా యాగంటీశ్వరుడి రథోత్సవం



అశేష భక్తజనం మధ్య తరలిపోతున్న స్వాముల వారి రథోత్సవ దృశ్యం

ఓర్వకల్లు: మండలంలోని ఎస్ కొంతలపాడు గ్రామంలో వెలిసిన అంబాసహిత యాగంటీశ్వర స్వాముల రథోత్సవం గురువారం తెల్లవారు జామున కనుల పండువగా సాగింది. స్వాముల వారి ఆరాధనోత్సవాలలో భాగంగా ఆలయ ఈఓ మద్దిలేటి పర్యవేక్షణలో ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ మద్దయ్య ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన ఉత్సవాలు ప్రశాంతంగా ముగిశాయి. ఇందులో భాగంగా ఆలయ అర్చకులు ఉరుకుందయ్యాచారి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ఉత్సవమూర్తిని నూతన పట్టు వస్త్రాలతో అలంకరించారు. అనంతరం పల్లకిలో ఆశీనులను గావించి డప్పులు, మంగళవాయిద్యాల నడుమ రథశాల వద్ద చేర్చారు. రథానికి రథాంగ హోమం, రథాంగ బలి నిర్వహించి విశిష్ట పూజలు చేశారు. ఆ తర్వాత ఉత్సవమూర్తిని సర్వాంగ సుందరంగా అలంకరించిన రథంలో అధిష్టింపజేశారు. హరహర మహదేవ శంభో శంకర అంటూ రథాన్ని ముందుకు కదిలించారు.అశేష భక్తజన సందోహం మధ్య తరలిపోతున్న స్వాముల వారిని కనులారా వీక్షించిన భక్తులు రథంపైకి పూలు, పళ్లు విసిరి తన్మయం చెందారు. స్థానిక నంది స్థూపం వరకు వెళ్లిన రథాన్ని తిరిగి పూర్వ స్థానానికి చేర్చారు. ఈ సందర్భంగా భిన్నాకృతులలో అమర్చిన భారీ బాణసంచా పేలుళ్లు, డప్పుల శబ్దాలు, భక్తుల ఓంకార నాదంతో ఆలయం మార్మోగింది. రాత్రి ఆలయ ప్రాంగణంలో హైదరాబాద్‌కు చెందిన జానపద కళాస్రవంతి నిర్వహించిన సంగీత విభావరి అలరించింది. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి స్వాముల వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ధర్మకర్త మండలి కాటసానికి సాదర స్వాగతం పలికి సత్కరించారు. అలాగే టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు గౌరు వెంకటరెడ్డి, పాణ్యం మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత, ఎమ్మెల్సీ కేఈ ప్రభాకర్, కేడీసీసీ బ్యాంక్ మాజీ అధ్యక్షులు మల్లికార్జునరెడ్డి స్వాముల వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వీరికి ఆలయ అధికారులు శాలువాలు, పూల మాలలతో సత్కరించారు. రాత్రి పలువురు దాతలు భక్తులకు అన్నదానం, అల్పాహార వసతి కల్పించారు. ఇందులో భాగంగా కర్నూలు నగరంలోని బుధవారపేట వాస్తవ్యులు అంబిలి నాగమ్మ, పాపయ్య జ్ఞాపకార్థం వారి కుమారులు చంద్రమౌలి, అమర్‌నాథ్ దాదాపు రెండు వేల మంది భక్తులకు అల్పాహారం అందజేశారు.

లింగ వివక్ష చూపరాదు

కోడుమూరు రూరల్: సమాజంలో స్త్రీ,పురుషులు ఇరువురు సమానమేనని, లింగవివక్ష చూపరాదని లద్దగిరి పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ నస్రీమ్ అన్నారు. గురువారం కోడుమూరులోని కేజీబీవీ పాఠశాలలో లింగ వివక్ష నిర్మూలనపై విద్యార్థినులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్‌యాదవ్, కేజీబీవీ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సుంకేసులకు ఇన్‌ఫ్లో

గూడూరు: సుంకేసుల జలశయానికి గురువారం ఎగువ నుంచి 1,620 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా కేసీ కాల్వకు 1,325 క్యూసెక్కుల నీటి విడుదల చేశారు. డ్యాంలో ప్రస్తుతం 0.813 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

హుండీ ఆదాయం లెక్కింపు

గడివేముల: గడివేములలో వెలసిన శ్రీ మూలపెద్దమ్మ ఆలయం హుండీ ఆదాయం గురువారం లెక్కించగా రూ.9,96,935 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ మోహన్ తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ తలారీ చిన్నన్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అలీ అక్బర్ స్వామి సరిగెత్తు



స్వామి వారికి ఫాతెహాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే

పాణ్యం: మండల కేంద్రమైన పాణ్యంలోని అలీ అక్బర్‌స్వామి సరిగెత్తు గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. స్వామి వారి చావిడి పునఃనిర్మాణం సందర్భంగా సరిగెత్తు నిర్వహించారు. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి హాజరై స్వామి వారికి పూల చాదర్‌ను సమర్పించారు. అలాగే చెక్కెర చదివింపులు, ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. గ్రామంలోని భక్తులు స్వామి వారిని దర్శించుకొని కొబ్బరికాయలను కొట్టారు. చెక్కెర చదివించారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ధర్మకర్త సయ్యద్ జాఫర్‌ఖాద్రి, ఎంపీపీ ఉసేన్‌బీ, కరుణాకర్‌రెడ్డి, బద్రీనాథ్‌రావు, సుబ్బరాయుడు, ఆటో మాబు, చందమామ బాబు, రాజన్న, చాంద్‌బాషా, సుధాకర్, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరు వరకు సాగునీరు

పాణ్యం: ఎస్సార్బీసీ ఆయకట్టు కింద రెండవ పంట వేసుకున్న రైతులకు ఈ నెల చివరి వరకు సాగునీరు అందిస్తామని గోరుకల్లు ఈఈ శుభకుమార్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. రైతులు సాగు నీటిని వృథా చేయరాదన్నారు. ఈ ఏడాది అధికంగా 11 టీఎంసీల నీటిని నిల్వ ఉంచామన్నారు. దీంతో ఆయకట్టు చివర ఉన్న ప్రతి ఎకరానికి రెండు పంటలకు సమృద్ధిగా నీరు అందించినట్లు చెప్పారు. ప్రధాన కాల్వ నుంచి బ్లాక్‌ల్లో ఎక్కడ నీరు వృథా కాకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రస్తుతం గోరుకల్లు జలాశయంలో 8 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు తెలిపారు. ప్రతి రోజు 1100 క్యూసెక్కుల మేరా ఎస్సార్బీసీ ప్రధాన కాల్వకు పంపుతున్నట్లు తెలిపారు. అలాగే గోరుకల్లు జలాశయం జంగిల్ క్లియరెన్స్ పనులు కూడా వేగవంతం చేశామని, త్వరలోనే పనులు పూర్తి అవుతాయన్నారు.